
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.2 । కనిష్ఠం 25.6
ఆంధ్రజ్యోతి
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 10 ఏప్రిల్ 2024







బీఆర్ఎస్ నుంచి ఆగని వలసలు



- కేటీఆర్, హరీ‌ష్‌రావులు భరోసా ఇస్తున్నా పార్టీ మారుతున్న గులాబీ నేతలు
- కాంగ్రెస్, బీజేపీలోకి భారీగా చేరికలు
- కామారెడ్డి బల్దియాలో ఖాళీ అవుతున్న కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గిన కాంగ్రెస్
- బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే, మరో ముఖ్యనేత చేరిక
- అయోమయంలో గులాబీ క్యాడర్

కామారెడ్డి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అధికారం మారిపోవడంతో బీఆర్ఎస్ నేతల్లో నిరుత్సాహం నెలకొంటుంది. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలు పార్టీకి దూరంగా ఉండగా మరికొందరు కండువాలు మారుస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ వైపు చూస్తున్నారు. వలసలను నివారించేందుకు ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీష్‌రావులు రంగంలోకి దిగి జిల్లాలో పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. అయినప్పటికీ పలువురు నేతలు బీఆర్ఎస్‌ను వీడుతునే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో కాంగ్రెస్, బీజేపీలోకి చేరికలు మరింత పెరిగాయి. కామారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు ఖాళీ అవుతున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కాంగ్రెస్ అవిశ్వాసం నెగ్గింది. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ బీజేపీలో చేరి లోక్‌సభ టికెట్‌ను తెచ్చుకున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే నేరెళ్ల ఆంజనేయులు మరో ముఖ్యనేత తానాజీరావులు బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇలా బీఆర్ఎస్ నుంచి వలసలు ఇతర పార్టీలోకి కొనసాగుతునే ఉన్నాయి. దీంతో పార్టీ క్యాడర్‌లో అయోమయం నెలకొంటుంది.

బీఆర్ఎస్‌కు గడ్డు కాలం

లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్‌లలోంచి భారీ మెజార్టీ ఇవ్వాలని బీఆర్ఎస్ ముఖ్యనేతలు భావిస్తున్నా క్షేత్రస్థాయిలో నాయకులు పట్టుదల వీడను న్నట్లుగా కనిపిస్తోంది. ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్‌లో బీఆర్ఎస్ క్యాడర్‌లో వర్గపోరు నెలకొంటున్న ట్లు ప్రచారం సాగుతోంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మూడు నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులు స్వల్ప ఓట్ల మెజార్టీతోనే ఓటమి పాలయ్యారు. దీనికి ప్రధానకారణం పార్టీ ముఖ్యనేతల్లో సమన్వయం లేకపోవ డమేనని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు పార్టీని వీడుతూ కాంగ్రెస్, బీజేపీలోకి చేరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఉత్సాహంగా ఉన్న బీఆర్ఎస్‌ను నేతలు వీడుతుండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు మొదలయ్యాయి. జిల్లాలో ఇప్పటికే కాంగ్రెస్ లో చేరికలు పెరుగుతున్నాయి. బీజేపీలోనూ బీఆర్ఎస్ నేతలు వలసలు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని, పార్టీకి ముఖ్య నేతలు లేక గడ్డుకాలం ఎదుర్కోక తప్పదనే వాదన ఆ పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది.

కామారెడ్డి మున్సిపల్‌ను కైవసం చేసుకునే దిశగా కాంగ్రెస్

కామారెడ్డి మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోనుంది. ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి నెగ్గారు. త్వరలో కొత్త చైర్‌పర్సన్‌ను ఎన్నుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే గత ఏడాది కిందట మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మెజార్టీ కౌన్సిలర్లు ఉండేవారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్‌కు చెందిన 23 మంది కౌన్సిలర్లు చేరిన విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్ బలం 27కు చేరింది. ఇదే బలంతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్‌కు చెందిన మరో 10 మంది కౌన్సిలర్లు అవిశ్వాసంకు మద్దతు తెలుపడంతో బీఆర్ఎస్ మున్సిపల్ పీఠాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఈనెల 15న కాంగ్రెస్ మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోనుంది. త్వరలోనే బీఆర్ఎస్‌కు చెందిన మరికొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం. అదేవిధంగా బాన్సువాడలోను పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల బీబీపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ పలువురు ముఖ్య నేతలు, నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇలా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతునే ఉన్నాయి.


బీజేపీలోకి బీఆర్ఎస్ నేతలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు పార్టీని వీడుతూ బీజేపీలో చేరుతున్నారు. గత నెలరోజుల కిందట బీఆర్ఎస్‌కు చెందిన జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. మరుసటి రోజే జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను తెచ్చుకున్నారు. సిట్టింగ్ ఎంపీ కాకుండా పలువురు బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్యనేతలు, కార్యకర్తలు బీజేపీలో చేరుతూవచ్చారు. పలువురు మాజీ సర్పంచ్‌లు బీజేపీ కండువా కప్పుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్యనేత మాజీ ఎమ్మెల్యే నేరెళ్ల ఆంజనేయులు, గాంధారి మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ కీలకనేత తానాజీరావులు బీఆర్ఎస్‌ను వీడి బీజేపీ కండువా కప్పుకున్నారు. జుక్కల్ నియోజక వర్గంలోనూ బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు బీజేపీలో చేరారు. ఇలా జిల్లాలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు పార్టీ వీడుతుండడంతో పార్లమెం ట్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ క్యాడర్‌లో అయోమ యం నెలకొంటుంది. వలసలను ఆపాలని బీఆర్ఎస్ క్యాడర్ అధిష్ఠానాన్ని కోరుతోంది.



మహ్మద్‌నగర్‌లో పోలీస్ స్టేషన్ ఏర్పాటయ్యేనా?

- రెవెన్యూ కార్యాలయం ఏర్పాటు చేశారు.. పోలీస్ స్టేషన్‌ను మరిచారు
- ఇరిగేషన్ అతిథి గృహం వద్ద సమీకృత ప్రభుత్వ కార్యాలయాలకు అనుకూల స్థలం



నిరుపయోగంగా ఇరిగేషన్ అతిథి గృహ భవనం

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), ఏప్రిల్ 9: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు అయ్యేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అక్టోబరు 2023లో మహ్మద్‌నగర్‌లో అప్పటి ప్రభుత్వం మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. రెవెన్యూ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ కవిత ప్రారంభించారు. విద్యాశాఖ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ట్రాన్స్‌కో కార్యాలయాలు ఉమ్మడి నిజాంసాగర్‌లోనే కొనసాగుతున్నాయి. మహ్మద్‌నగర్‌లో కార్యాలయాల ఏర్పాటు జరగలేదు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శోభ కృషితో మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించుకున్నారు. రెవెన్యూ కార్యాలయాన్ని పురాతన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసి పాలన వ్యవస్థ కొనసాగుతోంది. నిజాంసాగర్ మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ ఉంది. ఈ కేంద్రం నుంచే ఉమ్మడి మండలాల ఆలనా పాలనా కొనసాగుతోంది. మహ్మద్‌నగర్ పోలీసుస్టేషన్ ఏర్పాటుకు మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు. పురాతన ఇరిగేషన్ అతిథి గృహంలో పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకునేనా అని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. సమీకృత కార్యాలయాల ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం అధికారంలో ఉంటే ఇప్పటికే కార్యాలయాల ఏర్పాటు అయ్యేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఎంతో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు జడ్పీచైర్ పర్సన్ దఫేదార్ శోభ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మహ్మద్‌నగర్ మండల పరిధిలో 13 గ్రామ పంచాయతీలు, 18 గ్రామాలున్నా, నిజాంసాగర్‌కే వెళుతున్నారు. ఇప్పటికైనా మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.



మహ్మద్‌నగర్‌లో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం

నాగిరెడ్డిపేటలో నల్లపోచమ్మ జాతర ప్రారంభం

- జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
- మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 9 : మండల కేంద్రంలోని నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా ఉగాది నాడు అమ్మవారి ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శనను నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్లబండ్లను అందంగా అలంకరించి అమ్మవారి ఆలయం చుట్టూ తిప్పి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఎడ్లబండ్ల ప్రదర్శనను తిలకించ డానికి నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, మండలంతో పాటు మెదక్ జిల్లా పరిసర ప్రాంతాల మండలాల ప్రజలు, భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ జాతర ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. జాతర ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకుంటున్నారు. జాతర ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిం ది. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివా సులు, స్థానిక ఎస్సై రాజు ఆధ్వర్య ంలో గట్టి పోలీసు బందో బస్తు నిర్వహించారు.

గంప గోవర్ధన్ కబ్జా రాయుడు

- భిక్కనూరు కాంగ్రెస్ నాయకులు

భిక్కనూరు, ఏప్రిల్ 9: గంప గోవర్ధన్ కబ్జా రాయుడని భిక్కనూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి ఆరోపించారు. మంగళవారం భిక్కనూరులో ఆయన మాట్లాడుతూ బస్వాపూర్ గ్రామంలో గత అసెంబ్లీ ఎన్నికలకు రెండు రోజుల ముందు ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలను 200 మంది బీఆర్ఎస్ నాయకులతో కొట్టించిన సంగతి మర్చిపోయావా అని ప్రశ్నించారు. కామారెడ్డి, భిక్కనూరు, జంగంపల్లి, కామారెడ్డి నియోజకవర్గంలోని ఎక్కడెక్కడా భూములను కబ్జా చేసి నీ కుమారుడిపై, నీ అనుచరులపై మార్పించావో అన్ని బయట పెడుతామన్నారు. గంప గోవర్ధన్ పెద్ద సైకో, మోసగాడని అతడి బాధలు భరించలేక పేరున్న నాయకులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఎంపీపీ గాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు కిష్టాగౌడ్, సిద్ధరాములు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి నీవు పెట్టే బాధలు భరించలేకనే బయటకు వచ్చారని అన్నారు. పెద్దనోటని చిన్న నోట పడొద్దని, ఇకపై ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, కాంగ్రెస్‌పై గానీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు కిష్టాగౌడ్, సిద్ధరాములు, నాయకులు లింబాద్రి, దయాకర్‌రెడ్డి, సుదర్శన్, మహిపాల్‌రెడ్డి, నర్మాల రాంచంద్రం, శ్రీరాం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా ఉగాది వేడుకలు

- కామారెడ్డి వీక్లి మార్కెట్‌లో అట్టహాసంగా ఎడ్లబండ్ల ప్రదర్శనలు
- ఎడ్ల బండ్లకు ఫ్లెక్సీలతో అలంకరణ
- మండలాల్లో ఎడ్ల బండ్ల ప్రదర్శనలు, జడకొప్పులు, కోలాటలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, వైభవంగా పూజలు
- షడ్రుచులతో పచ్చడిని సేవించిన ప్రజలు
- ప్రశాంత వాతావరణంలో ఉగాది వేడుకలు
- కామారెడ్డిలో ఉగాది ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



ఎడ్లబండ్ల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 9: కామారెడ్డి జిల్లాలో మంగళవారం ఉగాది వేడుకలను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెలుగు నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఉగాది పండుగను నిర్వహిస్తారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లి మార్కెట్ ఆవరణలో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధి సదరు సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లను నిర్వహించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి జెండా ఊపి ఎడ్ల బండ్ల ప్రదర్శనను ప్రారంభించి, నిర్వాహకులకు మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ మన పూర్వీకుల నుంచి వచ్చిన పండుగ అని అన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలు, రైతులు, వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు, పాడిపంటలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని అమ్మవార్ల దీవెనలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడి లాగే మన జీవితంలోనూ షడ్రుచులు ఉంటాయన్నారు. ప్రకృతితో మమేకమై జీవించడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు మన పూర్వీకుల నుంచి వచ్చాయన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సంవత్సరంలో అంతా మంచే జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాల్లో ఎడ్ల బండ్ల ప్రదర్శన, కోలాటం, జడ కొప్పులాటలతో అలరించారు. ఎడ్లబండ్ల ప్రదర్శనలు అహుతులను ఆకట్టుకున్నాయి. ఆలయాల వద్ద వేద బ్రాహ్మణులు పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. అనంతరం ఆలయాల చుట్టు అట్టహాసంగా రంగురంగులతో అలంకరించిన ఎడ్లబండ్ల ప్రదర్శనలు నిర్వహించారు.

జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లి మార్కెట్‌లో పట్టణ అభివృద్ధి సదరు సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మధ్నాహ్నం వేదపండితులు ఆధ్వర్యంలో దుర్గామాత ఆలయం వద్ద పంచాంగ శ్రవణం వినిపించి రాశి ఫలాలు, మంచి చెడుల గురించి శ్రవణాన్ని వినిపించారు. దుర్గామాత ఆలయంతో పాటు ఊరడమ్మ, రాజ రాజేశ్వరీ, పోచమ్మ, లక్ష్మమ్మ, ముత్యాలమ్మ ఆలయాలతో పాటు పెద్దమ్మ ఆలయం చుట్టూ బండ్లను ప్రదర్శించారు. బండ ప్రదర్శనను చూడడానికి పట్టణ ప్రజలే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పిల్లా పాపలతో కలిసి వచ్చి ఎడ్లబండ్ల ప్రదర్శనను తిలకించారు. నూతన వస్త్రాలు వేసుకొని ఆలయాల్లో పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణాన్ని భక్తులు ఆలకించారు. సాయంత్రం పంచాంగం వీక్షించేందుకు ప్రజలు స్థానికంగా ఉన్న ఆలయాలకు తరలివచ్చారు. ఎడ్లబండ్లకు రంగురంగుల చీరలను అలంకరించి ఎడ్ల కొమ్ములకు రంగులు అద్దారు. పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు పోలీసు సిబ్బంది బందోబస్తును నిర్వహించారు. భక్తులు స్థానికంగా ఉన్న పోచమ్మ ఆలయాలు, శివరాంమందిర్, మహం కాళి ఆలయం, దుర్గమ్మ ఆలయాల చుట్టు ఎడ్ల బండ్లను తిప్పడంతో పాటు పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎడ్లబండ్లను ప్రదర్శ నకు తీసుకువచ్చారు. ఉదయం చిన్నారులు ఆలయాల చుట్టూ బండ్లను ఊరేగించారు.



వీక్లీ మార్కెట్‌లో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం



ఎడ్లను ఆలయం చుట్టూ తిప్పుతున్న రైతులు



ఎడ్ల బండిని తీసుకువస్తున్న కైలాస్ శ్రీనివాస్‌రావు



కాంగ్రెస్‌లో చేరిన డాక్టర్ కవితా రెడ్డి

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యురాలు కవితా రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో బోధన్ ఎమ్మెల్యేసుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు.

టీయూలో ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఎన్‌ఎస్‌యూఐ జెండ ఎగరవేస్తున్న ఎన్‌ఎస్‌యూ టీయూ ప్రతినిధులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 9: తెలంగాణ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంట్రాక్టు అధ్యాపకుడు దత్తహరి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో విద్యరంగ సమస్యల పరిష్కారానికి ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘం ముందుంటోందని, విద్యార్థి జీవితంలో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలంటే విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాలను ప్రోత్సహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ ప్రతినిధులు సాగర్, మహేశ్, రాజేందర్, నవీన్, కుశకుమార్, రాజేందర్, నవీన్,కుషశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో ఎన్‌ఎస్‌యుఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.ఈసందర్భంగా వి ద్యార్థి నాయకులు ఎన్‌ఎస్‌యుఐ జెం డాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, ఎన్ ఎస్‌యూఐ రూరల్ అధ్యక్షులు ఆశీష్, మండల అధ్యక్షుడు దినకర్, వర్కిం గ్ ప్రసిడెంట్ రమణ, రంజిత్‌రెడ్డి, సుభాష్, అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పండు, కోటేశ్వర్, అనిల్, చెలిమెల శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ క్రీడా పరికరాల వితరణ

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్9: ఆర్మూర్ పట్టణంలో మంగళవారం వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయమ ఉపాధ్యాయులకు బెస్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.మధుసూదన్‌రెడ్డి బెస్‌బాల్‌లు, పరికరాలను వితరణ చేశారు. క్రీడాకారుల సౌకర్యార్థం సుమారు రూ.12వేల విలువ చేసే క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యసంవత్సరంలో అన్ని విభాగాల రాష్ట్ర టోర్నమెంట్‌లలో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీలలో జిల్లా క్రీడాకారులు అధిక సంఖ్యలో ప్రతినిధ్యం వహించేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బెస్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు మార్కంటి గంగామోహన్, ప్రధానకార్యదర్శి ఎస్.వినోద్, వ్యాయమ ఉపాధ్యాయులు కోచ్‌లు నరేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

డిచ్‌పల్లి,ఏప్రిల్9: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై డిచ్‌పల్లి ఖిల్లా స్వాగత తోరణం ఎదుట అవుసుల తండాకు చెందిని మండన్ రాధబాయి రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొందని ఎస్సై మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. తీవ్ర గాయాలు అయిన మహిళను చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు మంగళవారం మరణించిందని ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి కుతూరు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ.1.25లక్షలు రామాలయ నిర్మాణానికి విరాళం

వర్ని,ఏప్రిల్9: ఉగాది పర్వదినాన శ్రీరామ మందిరం నిర్మాణం కోసం వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ దంపతులు అనితా వెంకట్ గౌడ్‌లు భారీ విరాళంను అందజేశారు. తమవంతు సహకారంగా రూ.1.25లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణం కోసం పెద్ద మొత్తంలో విరాళం అందజేసి ఉదారతను చాటుకున్న దంపతులను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగంపల్లి గంగారాం, హన్మాగౌడ్, నరేడ్ల సాయిలు, డీలర్ లక్ష్మీ నారాయణ, ఆలయ పూజారి పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా ఓపెన్ జిమ్‌ల నిర్వహణ

● పలు చోట్ల మరమ్మతులు లేక నిరుపయోగంగా ఉన్న పరికరాలు ● పట్టించుకోని మున్సిపల్ పాలక మండలి ● ఇబ్బందుల్లో ప్రజలు



పెర్కిట్‌లో నిరుపయోగంగా ఉన్న ఓపెన్ జిమ్



జిమ్‌లో విరిగిపోయిన వ్యాయామ పరికరాలు

పెర్కిట్,ఏప్రిల్9:ఆర్మూర్ పట్టణ ప్రజల కు వ్యాయామం చేసుకోడా నికి ప్రభుత్వం పట్టణంలోని పలు చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. హౌసింగ్‌బోర్డు కాలనీలోని పార్కు పక్కన గల ఓపెన్ జిమ్‌లో నిత్యం ప్రజలు ఉదయం,సాయంత్రం వచ్చి వ్యాయామం చేసారు. పార్కుకు పక్కనే ఉండడం వల్ల ఎక్కువ సంఖ్యలో ఓపెన్ జిమ్‌కు వస్తారు. గత కొన్ని నెలలుగా జిమ్‌లోని పరికరాలు చెడిపోయి వ్యాయామం చేసుకోవడానికి ప్రజ లు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పరికరాల మరమ్మత్తులు చేయలేదని వాపోతున్నారు. పట్టణంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన జిమ్‌లు సరిపోయైన వాతావరణంలో లేకపో వడం వల్ల నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని చోట్ల భారీగా నిల్వ ఉన్న ము రికినీరు, డ్రైనేజీ నీరు పక్కనే ఉండడం వల్ల దుర్వాసనకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల ఓపెన్ జిమ్‌లు నివాస సముదాయాలకు దూరంగా ఉండడం వల్ల ప్రజలు జిమ్‌లను వాడు కోలేకపోతున్నారు.జిమ్‌ల మరమ్మతులకు, నిర్వహణకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రజ లు కోరుతున్నారు.

జిమ్‌లోని పరికరాలను మరమ్మత్తు చేయాలి

ఓపెన్ జిమ్‌లోని పరికరాలన్ని చెడిపోయి వ్యాయమం చేయడానికి ఇబ్బంది ఉంది. రోజు ఉదయం పార్కుకు చేరుకొని వ్యాయమం చేస్తాం.గతకొన్ని నెలలుగా వ్యాయామ పరికరాలు అన్ని పాడై పోయాయి. వెంటనే అధికారులు పరికరాలను మరమ్మత్తు చేయాలి.

- రాకేష్, కాలనీ వాసుడు, ఆర్మూర్

వెంటనే వ్యాయామ పరికరాలను మరమ్మత్తు చేస్తాం



పార్కు పక్కనే గల ఓపెన్ జిమ్‌లోని పరికరాలు విరిగిపోయి చెడిపోయాయని మా దృష్టికి వచ్చింది. వెంటనే సిబ్బందిని ఏర్పాటు చేసి మరమ్మత్తులు చేసి వ్యాయామ పరికరాలను వినియోగంలోకి తెచ్చి ప్రజలకు అందుబాటులోకి ఉంచుతాం.

- రాజు, మున్సిపల్ కమిషనర్

ఘనంగా జగదాంబమాత సేవాలాల్ మహరాజ్ వార్షికోత్సవం

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 9: రూరల్ మండలం మల్కాపూర్ తండాలోని జగదాంబమాత సేవాలాల్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ 27వ వార్షికోత్సవం బంజారాల ఆరాధ్యదైవం పౌర్ణదేవికి చెందిన బాబురావ్‌మహరాజ్ చేతులమీదుగా జరిపించారు. భోగ్‌బండార్ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి పాల్గొన్నారు. బంజారా యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి సాంప్రదాయ నృత్యాలు చేశారు. జగదాంబమాత ఆలయం, రామారావ్ మహరాజ్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి హోమం నిర్వహించారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికి పక్క జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మర్యాదలతో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డికి మర్యాదలు చేసి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు మున్నీ నాయక్, కెతావత్‌ప్రకాష్ నాయక్, నునావత్ సురేష్ నాయక్, వసంతరావ్, సంతోష్, గంగారాం నాయక్, విఠల్ నాయక్, మోతీ నాయక్, జయపాల్ నాయక్‌లతోపాటు కాంగ్రెస్ నేతలు ముప్పగంగారెడ్డి, బాడ్సి శేఖర్, నరేష్, అగ్గుభోజన్న, కోర్వ గంగాధర్, మోత జనార్ధన్, కౌలాస్ మోహన్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి కలిసి రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

పెద్దబజార్, ఏప్రిల్ 9:రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలందరూ కలిసి రావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తన ఆధిపత్యాన్ని కొనసాగించడానికి స్వతంత్ర సంస్థలైన సీబీఐ, ఈడీ, ఇన్‌కంటాక్స్ తదితర సంస్థలను తన జేబు సంస్థలుగా మార్చుకొని ప్రత్యర్థి పార్టీల నాయకులను గ్రిప్‌లో పెట్టుకొని దాడులు చేస్తూ అరెస్టులను చేసి లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. అదేవిధంగా తన మాటను వినని వారికి జైళ్లో నిర్బంధించి అవినీతిపరులుగా చిత్రీకరిస్తూ బీజేపీ నాయకులు మాత్రమే చెడు నాయకులుగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. దేశంలో నూటికి 90 శాతంగా ఉన్న ప్రజలకు గత పది సంవత్సరాలుగా లబ్ధిచేకూర్చని నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలతో మాత్రం లక్షలాది కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసి పెట్టడం ద్వారా ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో వారి నుంచి డబ్బులు వసూలు చేసుకొని ఎన్నికల్లో లబ్ధిపొందుతున్నారని ఆయన విమర్శించారు. ప్రజల్లో విద్వేశాలను పెంచి తిరిగి మూడోసారి అధికారంలోకి రావడానికి మత ఉద్రిక్తలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు వెంకటేశ్, నూర్జహాన్, శంకర్‌గౌడ్, గంగాధర్, శాల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి దూకి ఆత్మహత్యాయత్నానికి

పాల్పడిన వ్యక్తిని కాపాడిన యువకులు

నవీపేట,ఏప్రిల్9: మండలంలోని యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడడానికి యత్నించిన వ్యక్తిని యంచకు చెందిన పలువురు యువకులు కాపాడారు. హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన రాజుదాస్ వైష్ణవ్ అనే వ్యక్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల అతిగా గుట్కాలు తినడం వల్ల నోటీ క్యాన్సర్ వచ్చింది. దీంతో నోటి క్యాన్సర్ జబ్బుతో బాధపడుతూ కుటుంబ సభ్యుల మధ్యన ఉండలేక మనస్థాపానికి గురై మంగళవారం మధ్యాహ్నం యంచ గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చి ఆత్మహత్య యత్నానికి యత్నించాడు. ఇదే సమయంలో బాసర వైపు వెళ్తున్న యంచ యువకులు అతనిని గమనించి బాసర పోలీసులకు అప్పగించారు. తాను అతిగా గుట్కాలు తినడంతోనే నోటి క్యాన్సర్ వచ్చిందని ఎవరు కూడా గుట్కాలు తినవద్దని ఆయన హితవు పలికారు. వ్యక్తిని కాపాడిన వారిలో ప్రవీణ్ కుమార్, వెంకటేష్, సాయి పవన్, లక్ష్మణ్, మహేష్ మారుతీలు ఉన్నారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

ఇందల్వాయి, ఏప్రిల్ 9:ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ శివారులో ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పి బండరాయిని ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయని ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామానికి చెందిన కడుదురం గంగారాం, ఎనగంటి సాయిలు ద్విచక్ర వాహనంపై ఇందల్వాయి వెళ్తుండగా ఎల్లారెడ్డిపల్లి శివారులో మూలమలుపు వద్ద బండరాయిని ఢీకొట్టడంతో కడుదురం గంగారాం (48) అక్కడికక్కడే మృతి చెందాడని ఎనగంటి సాయిలుకు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇద్దరు స్నేహితులు సొంత పనుల నిమిత్తం ఇందల్వాయి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని అన్నారు. పండుగ పూట గంగారాం మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. గన్నారం గత 15 సంవత్సరాల క్రితం బతుకుదెరువు నిమిత్తం చంద్రయాన్‌పల్లి గ్రామం నుండి భార్య పిల్లలతో సహా లోలం వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. ఆయన మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్, ట్రాక్టర్ల పట్టివేత

నవీపేట,ఏప్రిల్9: మండలంలోని అనంతగిరి సమీపంలో సోమవారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న ఒక మొరం టిప్పర్‌తో పాటు ట్రాక్టర్‌ను పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మల్కాపూర్ నుండి అనంతగిరి వైపు మొరం లోడ్‌తో వస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. అక్రమంగా మొరం తరలిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

'మైనారిటీ సోదరులు ఆలోచించి ఓటు వేయండి'

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 9: భీమ్‌గల్ మున్సిపాలిటీ కేంద్రంలోని మదర్స నూర్ మజీద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో మంగళవారం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ఈ ప్రాంతంతో నాకు అవినాభావ సంబంధం వుందని చాలా మందిని పేరు పెట్టి పిలువగలనని, మైనారిటీ సోదరులు ఆలోచించి ఓటు వేయండని అన్నారు. ఎంపీ అర్వింద్ గ్రామాల్లో చేసిన ఒక్క పని లేదని రోజుల్లో పసుపుబోర్డు అని 5 ఏండ్లు అయిన గతి లేదని, కాంగ్రెస్ ఎంపీగా ఉన్న జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఇక్కడ ఏనాడు ప్రజల మంచి చెడుల్లో పాలు పంచుకోలేదని, జీవన్ రెడ్డిని జగిత్యాల నియోజక వర్గ ప్రజలే వ్యతిరేకిస్తున్నారని అన్నారు. నాకు ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ లో ప్రాతినిధ్యం వహించిన అనుభవం వుందని అన్నారు.ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని బాజిరెడ్డిని ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు.ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మహారాష్ట్రలో ఏక్‌నాథ్‌షిండే లాగా ఇక్కడ రేవంత్‌రెడ్డి మరో ఏక్ నాథ్ షిండే అవడం ఖాయమని బీజేపీలోకి తీసుకవెళ్లడం ఖాయమని అన్నారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి,జిల్లాలో అర్వింద్, సుదర్శన్‌రెడ్డి ఒకటే అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సోదరులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'దేశంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే '

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 9: భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన గ్రామ కమిటీ అధ్యక్షుడు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అనిల్ ఈరవత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు నోరెళ్లబెట్టుకుంటున్నాయని, దేశంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

● మండలంలో వందల ఎకరాల్లో పంట నష్టం
● నేలరాలిన మామిడికాయలు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం
● బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి



దోమలెడ్గి శివారులో మహిళ రైతును ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే



చందూర్ శివారులో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి



సోంపూర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న పోచారం సురేందర్‌రెడ్డి

బోధన్‌రూరల్,ఏప్రిల్9: సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టపడించిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి గురవ్వడం రైతు కంట కన్నీరు పెట్టించింది. అకాల వర్షం, వడగండ్ల వాన రైతులకు అపార నష్టం కలిగించింది. బోధన్, సాలూర మండలంలోని హున్స, మందర్నా, కుమ్మన్‌పల్లి, సాలంపాడ్, పెంటాఖుర్దు, తదితర గ్రామాలలో 300ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారి సంతోష్ తెలిపారు.ఈదురు గాలులకు మందర్నా పరిసరాల మామిడి తోటల్లో మామిడి కాయలురాలి కింద పడ్డాయి. మామిడితోట రైతులకు సైతం అపార నష్టం వాటిల్లింది.

వర్ని: ఉగాది పర్వదినాన అన్నదాతలకు అకాల వర్షం కన్నీటిని మిగిల్చింది. చేతికొచ్చిన పంట చేజారిపోవడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి భారీ ఈదురు గాలులు, వడగండ్ల వర్షం కురడంతో కనీవిని ఎరుగని రీతిలో అపార నష్టం వాటిల్లింది. మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి నగేష్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ బాధ్యులు పోచారం సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డిలు ఆయా గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. వర్ని మండలం జలాల్‌పూర్, సైద్‌పూర్, ఫైడిమల్, సిద్దాపూర్, రాజ్‌పేట్, శంకోరా గ్రామాల శివారులో 63మంది రైతులకు సంబంధించిన 105ఎకరాల్లో పూర్తిగా వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారి నగేష్ రెడ్డి తెలిపారు. చందూర్ మండలంలో చందూర్, ఘన్‌పూర్, లక్ష్మాపూర్, మేడిపల్లి, కారేగాం శివారులో 255మంది రైతులకు సంబంధించిన 428ఎకరాల్లో పూర్తిగా వరి పంట దెబ్బతిన్నట్లు ఏవో వెల్లడించారు. రైతులు అధైర్య పడొద్దని పంట నష్టం అంచనాన్ని ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందేలా చర్యలు చేపడుతున్నట్లు ఏవో నగేష్ రెడ్డి భరోసా ఇచ్చారు. కాగా ఆయా గ్రామాల శివారులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డిలు పర్యటించి రైతులకు ధైర్యం చెప్పారు.

● గట్టెక్కిన వేలాది ఎకరాలు.. రికార్డు దిగుబడులు

వర్ని, చందూర్ మండలాల్లో అకాల వర్షం నుంచి వేలాది ఎకరాల పంట సాగు నుంచి రైతులు గట్టెక్కారు. నవంబరు 15నుంచి 20లోపు గంగా కావేరి వరి రకంను నారుమడులు పోసి డిసెంబర్ 20లోపు నాట్లు వేశారు. దీంతో ముందుగా సాగు చేసిన రైతుల పంటలు మార్చి 25లోగా కోతలు పూర్తయ్యాయి. దీంతో ముందస్తు సాగు రైతులకు ఎండిన వరి ధాన్యం ఎకరాకు 50నుంచి 55బస్తాలు, పచ్చి ధాన్యం ఎకరాకు 55నుంచి 60బస్తాల రికార్డు దిగుబడులు వచ్చాయి. పచ్చి ధాన్యం క్వింటాలుకు రూ.2200 నుంచి రూ.1950ధర లభించగా ఎండిన ధాన్యంకు క్వింటాలుకు రూ.2150 గిట్టుబాటు ధర లభించింది. ఆలస్యంగా నారుమడులు పోసిన అన్నదాతలు మాత్రం నిండా మునిగారు. ఖరీఫ్ సీజన్‌లోనూ మే 20లోగా బీపీటీ రకాన్ని నారుమడులు పోసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

కోటగిరి: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. పొతంగల్ మండలంలోని దోమలెడ్గి, టాక్లీ, సోంపూర్ గ్రామాలలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఒకటి, రెండు రోజుల్లో పంట చేతికొచ్చే దశలో అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. ప్రభుత్వం పంట నష్టం అంచన వేసి ఎకరానికి 25వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్ పటేల్, ఏజాజ్ ఖాన్, నాయకులు హంగర్గ గంగాదర్, దిగంబర్ పటేల్, మాధవ రావు, చాకూర్ గంగాధర్, జీవన్, నాగరాజు గౌడ్ తదితరులున్నారు.

మోస్రా: మోస్రా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం కాంగ్రెస్‌పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి పరిశీలించారు. రైతులకు పంట నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, తిమ్మాపూర్ గ్రామ అధ్యక్షుడు గజ్జి నారాయణ, మండల ఉపాధ్యక్షుడు శంకర్, గ్రామ అధ్యక్షులు సైనపురం నర్సారెడ్డి, మైనార్టీ యువ నాయకులు ఇంతియాస్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తిమీర్‌కర్ అశోక్, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, బిల్లా రాజశేఖర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సంగం సాయిలు, బీసీ సెల్ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండలంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. దోమలెడ్గి, సుంకుని, కొల్లూర్, సోంపూర్, టాక్లీ, రాంగంగానగర్ శివారులలో చేతికి వచ్చిన వరిపంట 90శాతం నేల కొరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్టం జరగడం బాధకరమని మాజీ ఎమ్మెల్యే అన్నారు. పలువురు రైతులను ఆయన ఓదార్చారు. అకాల వర్షం రైతులకు తీవ్రనష్టం చేకూర్చిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి 10వేల రూపాయల పంటనష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. పంటనష్టాన్ని పూర్తిస్థాయిలో అంచన వేసి నష్టపరిహారం అందిస్తామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే రైతులకు పంట బీమా సౌకర్యం అందకుండా పోయిందన్నారు. వచ్చే సీజన్ నుంచి రైతులకు తప్పనిసరి పంటల బీమా చేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. హెగ్డోలి గ్రామంలో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. పొద్దు తిరుగుడు పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ శంకర్, మాజీ ఎంపీపీ పవన్, కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్‌కుమార్, ఎంపీటీసీ విఠల్, హన్మంత్ పాల్గొన్నారు.

● పొతంగల్ మండలంలో

అకాల వర్షానికి సుమారు 500ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. మండలంలోని టాక్లీ, సోంపూర్, దోమలెడ్గి గ్రామాలలో దెబ్బతిన్న వరిపంటను మంగళవారం మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. సుమారు 500ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం మినహాయింపు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 9: మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లు చేసి మున్సిపల్ అభివృద్ధికి ఆ నిధులను వినియోగించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఆలోచనలు చేస్తోంది. అందులో భాగంగానే నివాస గృహాలు, వాణిజ్య సముదాయ భవనాలకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం మినహాయింపు నిస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రకటించింది. మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులతో పాటు పన్నుల వసూళ్లతో వచ్చే నిధులు వినియోగిస్తారు. దీంతో పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికార యంత్రాంగం దృష్టి సారించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూళ్లకు దాదాపు చేరువయ్యారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం మినహాయింపు ఏప్రిల్ 30 వరకు మాత్రమే ఉందని ప్రజలు వినియోగించుకోవాలని కోరుతున్నారు.

ప్రచారం కల్పిస్తేనే..

ఎర్లీబర్డ్ పథకానికి సంబంధించి మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఇప్పటి నుంచే ప్రచారం చేపట్టి పన్నులు వసూలు చేయాలి. సరైన ప్రచారం లేకపోవడంతో గత ఏడాది చాలా మందికి ఈ పథకం, రాయితీ విషయం తెలియక పన్నులు చెల్లించలేదు. దీంతో మొన్నటి ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్ల మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సవాల్‌గా మారింది. ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లను సీడీఎంఏ అధికారులు ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ముందుకు వచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు. గత మార్చి 2024 వరకు పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించని వారికి ఈ పథకం వర్తించదని, పూర్తి బకాయిలు చెల్లించిన వారు మాత్రమే ఈ పథకానికి అర్హులనే విషయాన్ని ప్రజల్లోకి

- ఆఫర్ ప్రకటించిన మున్సిపల్ శాఖ
- క్యూఆర్ కోడ్‌తో చెల్లించే అవకాశం
- ఏప్రిల్ 30 వరకు గడువు



తీసుకెళ్లి ఎర్లీబర్డ్ ద్వారా పన్ను ముందస్తు చెల్లింపులను చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డిజిటల్ పేకు శ్రీకారం

ప్రస్తుతం సమాజంలో డిజిటల్ పేకే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతుండడంతో ప్రభుత్వం సైతం డిజిటల్ పే వైపు అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-సేవలు ప్రారంభించిన ప్రభుత్వం పన్నులను సైతం డిజిటల్ మార్గంలోనే వసూళ్లు చేయాలని ఆలోచన చేస్తోంది. అందులో భాగంగానే డిజిటల్ పేతో పన్ను వసూలు చేసేందుకు మున్సిపల్ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. స్మార్ట్‌ఫోన్లలో క్యూఆర్ కోడ్ స్కాన్, ఏటీ ఎం, డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, యూపీఐ, గూగుల్‌పే, ఫోన్‌పై ద్వారా నేరుగా ఆ మున్సిపాలిటీల ఖాతాలోకి జమ అవుతోంది. దీంతో అధికారులకు, వినియోగదారులకు సమయం ఆదా కావడమేగాక నిర్ణీత గడువులోగా పన్ను చెల్లించే వీలు కలుగుతుందని ఈ పద్ధతికి ప్రభుత్వం మొగ్గు చూపిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈనెల చివరి వరకే అవకాశం

ప్రతీ సంవత్సరం ఆస్తిపన్ను వసూలు అనుకున్న మేర జరగడం లేదని గ్రహించిన మున్సిపల్‌శాఖ గత ఐదారు సంవత్సరాల నుంచి సరికొత్త ఆలోచనలకు తెరలేపి అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు తయారు చేస్తోంది. అందులో భాగంగానే గత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ ప్రకటించి పన్ను వసూళ్లకు చేరువయింది. ప్రస్తుతం 5 శాతం మినహాయింపు అవకాశంను మళ్లీ తెరమీదకు తీసుకువచ్చింది. అయితే ఈ మినహాయింపు అవకాశం ఈ నెల చివరి వరకు మాత్రమే ఉంటుందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. రూ.లక్ష చెల్లింపులు జరిపిన వారికి రూ.95వేలను, రూ. 1000 ఉంటే రూ.950, రూ.500 ఉంటే రూ.475 చెల్లించవచ్చు ఇలా ప్రతీ ఇంటి, వాణిజ్య సముదాయానికి చెందిన పన్ను మొత్తంలో 5 శాతం రిబేట్ ఉంటుందని పేర్కొంటున్నారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● సుజాత, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

పన్ను వసూళ్ల కోసం ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రిబేట్‌ను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలి. గత ఆర్థిక సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా పన్ను వసూళ్ల లక్ష్యానికి అన్ని రకాలుగా కృషి చేస్తాం. నిర్ణీత గడువులోగా పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి.

జిల్లా వ్యాప్తంగా ఉగాది వేడుకలు



లింగంపేటలో మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదక్షిణ



పోచమ్మ ఆలయంలో ఎడ్లబండ్ల ప్రదర్శన



ఉగాది పచ్చడి వితరణ చేస్తున్న యువకులు

లింగంపేట, ఏప్రిల్ 9: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో క్రోధీ నామ సంవత్సర ఉగాది పండగ వేడుకలను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తెల్లవారు జామునే వాకిళ్లలో కల్లాపి జల్లి ద్వారాలను మామిడి ఆకుల తోరణాలతో అలంకరించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారు జామున పలువురు రైతులు వ్యవసాయ క్షేత్రాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పనులను ఆరంభించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద జాతర ఉత్సవాలలో భాగంగా ఎడ్లబండ్ల ప్రదక్షణను ఘనంగా నిర్వహించారు. మండంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. తెలుగు నూతన సంవత్సరం వేళ వేద పండితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

తపస్ ఆధ్వర్యంలో వసతి గృహంలో ఉగాది సంబరాలు

బాన్సువాడటౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మంగళవారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి పచ్చడి తయారు చేసి అందరూ కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూనేకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు వేద్ ప్రకాశ్, జంగిల్‌రాజు, కిష్టయ్య, సుధా తదితరులున్నారు.

బాన్సువాడటౌన్: బాన్సువాడ పట్టణ ప్రజలు మంగళవారం ఉగాది సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం అభ్యంగన స్నానమారించి, నూతన వస్త్రాలను దరించారు. ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. పచ్చడి, ప్రత్యేకమైన పిండి వంటలను తయారు చేశారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. యువకులు బస్టాండ్ ప్రాంతంలో పచ్చడి వితరణ చేశారు. సాయంత్రం ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. ద్వాదశ రాశి ఫలాల గురించి వివరించారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు మధుసూదనశర్మ, దత్తమహారాజ్, గిరీశ్‌శర్మ, శ్రీరామ ఆలయ కమిటీ అధ్యక్షుడు రమాకాంత్ రావు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి, కార్యదర్శి దేవికృష్ణ ప్రసాద్, జిల్లా రైతు సమన్వయి సమితి అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, త్రివిక్రమ రావు, చంద్రకాంత్‌రావు, గోపాల్, సాయిబాబా, మురళీ, పెంటయ్య, కార్యవర్గ సభ్యులు, సభ్యులు తదితరులున్నారు.

బీర్కూర్: మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శంభురెడ్డి కుటుంబసమేతంగా ఉదయాన్నే ఆలయానికి చేరుకున్నారు. స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన ఉగాది పచ్చడిని సేవించి, భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం వేద పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మద్నూర్, డోంగ్లీ మండలాల్లో భక్తిశ్రద్ధలతో ఉగాది పండుగను జరుపుకున్నారు. తెలుగు సంవత్సరం ప్రారంభం సందర్భంగా మహారాష్ట్ర సాంప్రదాయం ప్రకారం గుడి పాడవగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి షడ్రుచులతో తయారు చేసిన పచ్చడిని సేవించారు. ఆర్య సమాజ్‌లో సాముహిక యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఆర్య సమాజ్‌లో ప్రతియేటా నిర్వహించే మాదిరిగా యజ్ఞం నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని ఆయా ఆలయాల్లో ఉగాది పండుగ సందర్భంగా పంచాగ శ్రవణం నిర్వహించారు. మండల కేంద్రంలోని లక్ష్మీ నారాయణ మందిరం, బీజేపీ కార్యాలయంలో పంచాగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ పటేల్, మాజీ ఎమ్మెల్యే గంగా రాం, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం ఉగాది పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాల్లో వేదపండితులు పంచాంగం చదివి వినిపించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఎడ్లబండ్ల ఊరేగింపు. కామినేని అనిల్ ఆధ్వర్యంలో గడికోట నుంచి ఎడ్లబండిని ముస్తాబు చేసి ఊరేగించారు. కొన్ని గ్రామాల్లో ట్రాక్టర్లను గ్రామ దేవతల చుట్టూ ఊరేగించారు.ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండ ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, శ్రీనివాస్, గజవాడ శ్రీకాంత్,పున్న లక్ష్మణ్, మద్దూరి భూపాల్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాయంత్రం మండల కేంద్రానికి చుట్టు పక్కల ఉన్న ప్రాంతాల వారు ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం చిన్నలు, పెద్దలు ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో పండితులు పంచాంగ పఠనం చేశారు.ఉగాది పచ్చడిని ప్రజలు ఒక్కరికొక్కరు పంచుకుని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని నల్లపోచమ్మ, ముత్యాలమ్మనాయకమ్మ దేవతామూర్తులకు భక్తిశ్రద్ధలతో గ్రామస్థులు బోనాలుసమర్పించారు.

తాడ్వాయి: మండలంలో మంగళవారం శ్రీ కోధినామ ఉగాది సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరానికి ప్రజలు ఆహ్వానం పలుకుతూ గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడ్వాయి, నందివాడ, ఎండ్రియాల్, దేమికలాన్, కరడ్‌పల్లి, బ్రహ్మణపల్లి, కృష్ణాజీవాడి, బ్రహ్మాజీవాడి, చిట్యాల, సంతాయిపేట గ్రామాలల్లో ఎడ్లబండ్ల, ట్రాక్టర్ల ప్రదర్శనలు చేశారు. ఉదయం గ్రామపంచాయతీ ఆవరణలో పంచాంగం శ్రవణం విన్నారు. తాడ్వాయిలో ఆర్యవైశ్యసంఘం ప్రతి నిధులు ప్రజలకు ఉచితంగా ఉగాది పచ్చడి అందించారు. శబరిమా, భీమేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండుగను మంగళవారం మండలప్రజలు భక్తిశ్రద్ధల నడుమ ఘ నంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించి షడ్రుచుల పచ్చడిని, వివిధ రకాల పిండి వంటలు తయారు చేసుకోని ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబసభ్యులు ఆరగించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంతో పాటుగా పలు ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. కాగా శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం చుట్టూ భిక్కనూరుతో పాటుగా ఆయాగ్రామాల ప్రజలు ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని డప్పు చప్పుళ్ల నడుమ నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లో సాయంత్రం పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

బిచ్కుంద: మండలంలో మంగళవారం నూతన శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాదిపండుగ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైతులు గ్రామదేవతల చుట్టు ట్రాక్టర్లతో ప్రదర్శనలు చేశారు. మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ్ శివాలయ ప్రాంగణంలో మఠాధిపతి సోమలింగ శివాచార్య స్వామిజీ ఆధ్వర్యంలో గజానన్ పంతులు సంవత్సరం పాటు కాలాన్ని సుచించే నూతన పంచాంగ శ్రవణాన్ని తెలియజేశారు.



వసతి గృహంలో ఉగాది సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



తాడ్వాయిలో ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శన చేస్తున్న గ్రామస్థులు



టీటీడీలో పంచాంగం చెబుతున్న పండితులు



భిక్కనూరులో ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

తాళం వేసిన ఇంట్లో చోరీ

గాంధారి, ఏప్రిల్ 9: గాంధారి మండల కేంద్రంలోని సోయక్ పాష అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. సోయక్ పాష గాంధారిలో కొత్త ఇంటిని కట్టుకుని నివసిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఉండడంతో కుటుంబ సభ్యులతో కలిసి పాతింటికి వెళ్లి రాత్రి అక్కడే నిద్రించారు. ఉదయం లేచి కొత్త ఇంటికి వచ్చి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు అతని ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న అరతులం బంగారం గుండ్లు, వెండి పట్టగొలుసులు రూ.5వేల నగదు దొంగతనం చేసినట్లు తెలిపారు. పాష ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కృష్ణాజీవాడిలో బోరు మోటార్‌లో కేబుల్ చోరీ

తాడ్వాయి, ఏప్రిల్ 9: తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి గ్రామంలో సోమవారం రాత్రి 8 మంది రైతులకు చెందిన బోరు మోటార్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. గ్రామానికి చెందిన బద్దం అనూష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సంగారెడ్డి, లలిత, రాఘవరెడ్డి, దత్తరెడ్డి, సంగారెడ్డి, జనార్ధన్‌రెడ్డిలకు చెందిన మోటార్ కేబుళ్లను కత్తిరించుకుని వెళ్లినట్లు రైతులు పేర్కొంటున్నారు. గతంలో రెండు సార్లు చోరీకి పాల్పడిన పోలీసులు ఎవరిని గుర్తించలేదని పోలీసులు ఇప్పటికైన దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



బోర్ మోటార్ల వద్ద కేబుల్‌ను చోరీ చేసిన దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- ప్రాజెక్ట్(జడ్)
శాంతి	- టిల్ స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్

బాన్సువాడ

మహేశ్వరి	- ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర	- మంజుమ్మల్ బాయ్స్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210



నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

దోమకొండ, ఏప్రిల్ 9: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావు తెలిపారు. కార్యకర్తలు ఉదయం 10 గంటల వరకు హాజరవ్వాలన్నారు. ఈ సమావేశానికి కామారెడ్డి నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, మాజీ మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తన్నీరు హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్ హాజరవుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



కేక్ కట్ చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 9: జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ దేశభవిష్యత్తును రూపొందించడంలో విద్యార్థుల పాత్ర ముఖ్యమని ఆయన అన్నారు. 1971లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నేతృత్వంలో ఎన్ఎస్‌యూఐ ఏర్పడిందని, ఇందులో పని చేసిన చాలా మంది నాయకులు జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించాయని అన్నారు.విద్యా, ఉద్యోగ హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి భరత్, టింకు, ఆకాష్, అలీం, ఫణింద్ర, అభిలాష్, యశ్వంత్, ఆనంద్, సాయినాథ్, రాఖీ, మనోహర్, దినేష్, విష్ణు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును రూపొందించడంలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని, 1971లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలో ఏర్పడిందని విద్యార్థుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని వారు అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు పాటాకుల వినోద్ గౌడ్, సిద్దు సంతోష్, గోవింద్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో ముదిరాజ్ జెండా ఆవిష్కరణ

దోమకొండ, ఏప్రిల్ 9: మండల కేంద్రంతో పాటు సంగమేశ్వర్ గ్రామాల్లో బుధవారం ఉగాది క్రోధి నామ సంవత్సర పండుగ సందర్భంగా ముదిరాజ్ కులస్థులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దోమకొండ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్న లక్ష్మణ్, ఎంపీటీసీ కడారి రమేష్, రాములు, శివరాంమందిర్ ఆలయ కమిటీ చైర్మన్ అబ్రబోయిన రాజేందర్, శ్రీనివాస్, అంజయ్య, రాజేందర్,నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఏఈవో

గాంధారిలో పంటల పరిశీలన

గాంధారి, ఏప్రిల్ 9: గాంధారి మండల పరిధిలోని గాంధారి, గుర్జాల్, బ్రహ్మణపల్లి, కోనాయిపల్లి గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలతో దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ప్రాథమికంగా 971 ఎకరాలలో వరి, 201 ఎకరాలలో జొన్న నష్టపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు నిఖిత, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన రాజంపేట, గాంధారి మండల నాయకులు

బీజేపీలో చేరిన పలువురు నాయకులు

రాజంపేట/గాంధారి, ఏప్రిల్ 9: రాజంపేట, గాంధారి మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. గాంధారి మండలంలోని మాజీ ఎమ్మెల్యే నేరెళ్ల ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ తానాజీరావు తదితరులు బీజేపీలో చేరారు. రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, సత్తయ్య, స్వాతి, దేవదాస్, జీవ్లా, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములు, నాయకులు బలరాం, భాస్కర్, యోగరాంరెడ్డిలు చేరారు.



పద్మశాలి సంఘం భవనంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

పద్మశాలి సంఘ భవనంలో యజ్ఞం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 9 : ఉగాది పర్వదినం సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో మంగళవారం యజ్ఞం నిర్వహించి పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పద్మ దశరథం, పండిత పెద్దలు పోశెట్టి, రామకృష్ణ, రాజేష్, ఆగమయ్య, హనుమంతు, కోశాధికారి విద్యా, రవికుమార్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు నర్సింహులు, శ్రీనివాస్, గోస్కి బాలకిషన్, దుర్గయ్య, పద్మ బాల్‌కిషన్ తదితరులు పాల్గొన్నారు.